ప్రజాశక్తి

సోమవారం 2 డిసెంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు


ఏడాదిగా ఎదురుచూపులు

- రేషన్ కార్డులపై మార్గదర్శకాలు ఏవీ?
- పింఛన్లపై పేదల్లో అయోమయం
- నేటి నుంచి దరఖాస్తులంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- ఉత్తర్వులేమీ రాలేదంటున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కొత్తగా రేషన్ కార్డులు, నూతన పింఛన్ల జారీపై ఈనెల 2వ తేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సోషల్ మీడియాలో గత 10 రోజులుగా ప్రచారమవుతోంది. అయితే ఆదివారం రాత్రి వరకు ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు మార్గదర్శకాలేమీ రాలేదని జిల్లా అధికారులు తెలిపారు. ప్రధానంగా సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు లేవు. కొత్తగా రూపొందించిన స్టాఫ్ట్‌వేర్ రాలేదు. 2023 డిసెంబరు తరువాత కొత్త కార్డులు, పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. తరువాత ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ కార్డులు, పింఛన్లపై ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. కొత్త పింఛన్లకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎటువంటి ఆదేశాలూ రాలేదు.





రేషన్ కార్డుల కోసం గతేడాడి డిసెంబరు వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి నంబర్లు కూడా కేటాయించారు. కానీ ఆ తరువాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది వరకు ఉన్నారు. వీరి దరఖాస్తులు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చినా ఇంతవరకు మోక్షం లేదు. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకు ఏడాది కాలంలో నూతనంగా వివాహం చేసుకున్న వారు, ఒంటరి మహిళలు, ఇతర తరగతుల వారు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేక ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది రేషన్ కార్డులు లేకపోవడం వల్ల నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేదు. కార్డుల్లోని కొంతమంది కుటుంబ సభ్యులు మరణిస్తే వారి పేరున కార్డుంటే వారు ఈకేవైసీ చేస్తే కానీ ఇతర సదుపాయాలు ఏవీ అందకపోవడం వల్ల రేషన్ కార్డుల్లో తదుపరి కుటుంబ పెద్దల పేరున మార్చడానికి కూడా ఇంత వరకు తగిన మార్గదర్శకాలు రాలేదు.

కొత్త పింఛన్లకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల దాదాపు 16 నెలలుగా అర్హులైన పేద వర్గాల వారు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, భర్తను కోల్పోయిన వితంతువులు, ప్రమాదాల్లో వైకల్యానికి గురైన వికలాంగులు పెద్ద సంఖ్యలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిరీక్షిస్తున్నారు. 50 ఏళ్ల దాటిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు పింఛన్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాకపోవడం వల్ల 50 ఏళ్ల దాటిన దాదాపు లక్ష మంది వరకు ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై ఇంకా ఆదేశాలు రాలేదని జిల్లా సరఫరా అధికారి కోమలి పద్మ తెలిపారు.



నరసరావుపేట పట్టణంలో యుటిఎఫ్ ర్యాలీలో ఎమ్మెల్సీలు, నాయకులు, ఉపాధ్యాయులు

4 లో

విద్యారంగ పరిరక్షణ.. ఉపాధ్యాయ హక్కుల సాధన..

యుటిఎఫ్ పల్నాడు జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఉద్ఘాటన - ఉపాధ్యాయుల భారీ ర్యాలీ



ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

పోరాట శిబిరంలో మళ్లీ జెండా

గుడిసెల కూల్చివేతలపై సిమెంట్ కార్మికుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-తాడేపల్లి

తమ గుడిసెలను పోలీసులు శనివారం రాత్రి కూల్చివేయడాన్ని నిరసిస్తూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పోరాట శిబిరం నుండి ప్రకాష్ నగర్ సెంటర్ వరకు ఆదివారం ప్రదర్శన చేపట్టారు. పోరాట శిబిరం వద్ద ఉద్యమ జెండాను మరోసారి ఎగరవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన పోరాటానికి అధికారులు మద్దతివ్వాలని కోరారు. కోర్టు తీర్పుల ప్రకారం కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకపోగా గుడిసెలనూ కూల్చడం దారుణమన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు నష్టపరిహారం అందే విధంగా మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వమూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, పి.కృష్ణ, నాయకులు డి.వెంకటరెడ్డి, కె.కరుణాకర్‌రావు, సిఐటియు నాయకులు వి.దుర్గారావు, బి.ప్రకాష్, ఆశీర్వాదం, బి.వెంకయ్య, సాంబశివరావు, యెహోషువ, బాష, రమాదేవి, ఎం.శారద, సారమ్మ, సామ్రాజ్యం, హిమంబి, దుర్గమ్మ, నాని, నాగేశ్వరరావు, ఎం.గురవయ్య, సుబ్బారావు, ఇజ్రాయిల్, కృష్ణ పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా నాకు వాట్సప్ చేయండి

- వర్సిటీ హాస్టల్ విద్యార్థినులతో తెనాలి సబ్‌కలెక్టర్
- హాస్టల్ భోజనంలో పురుగులు, ఇతర సమస్యలపై సమావేశం
- నేడు ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రకటన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా హాస్టల్లోని భోజనంలో పురుగులు రావడం, నాణ్యత కొరవడంపై విద్యార్థులు ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థినులతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా ఆదివారం సమావేశమయ్యారు. అయితే సమావేశంలోనికి మీడియాను అనుమతించ లేదు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలను అధికారుల దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. భోజనంలో

▶ 2లో



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పక్కన ఎస్పీ, జెసి తదితరులు

ఆట, వ్యాయామం అలవాటుగా మారాలి

పోలీసు వార్షిక క్రీడల బహుమతి ప్రదానోత్సవంలో ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, విధుల్లో చురుగ్గా ఉండేందుకు క్రీడలు దోహదం చేస్తాయని గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో రెండ్రోజులపాటు నిర్వహించిన పోలీస్ వార్షిక క్రీడలు ఆదివారం ముగిశాయి. ఆర్మ్డ్ రిజర్వు జట్టు విజేతగా నిలవగా బహుమతి ప్రదానోత్సవానికి ఐజి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసేవారు

▶ 2లో



మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ

వివక్ష చూపితే ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఇతరు హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నారాయణ అన్నారు. గురజాల డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కంభంపాడులో శనివారం రాత్రి పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ ఎం.నారాయణ మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాల వారు సోదరభావంతో మెలగాలని సూచించారు. ఎలాంటి వివక్షకు గురైనా ధైర్యంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అనరాని మాటలతో దూషిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. బాలికలకు 18 ఏళ్లలోపు పెళ్లిళ్లు చేయొద్దన్నారు. వారిని చదువుకోనివ్వాలని, అందుకు ఇబ్బంది ఉంటే ఉచితంగా విద్యను అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో మాచర్ల రూరల్ ఆర్ఐ భాస్కర్‌రావు, సర్పంచ్ దేవరాయి యశోదమ్మ, విఆర్ఓ చంద్రశేఖర్, సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు, రూరల్ ఎఎస్ఐ మోషే పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- మాచర్ల

నిరుద్యోగులకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా శిక్షణిచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పల్నాడు జిల్లా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డోమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు 5వ తేదీలోపు ఎస్‌కెబిఆర్ కాలేజీలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న వారికి 3 నెలల ఉచిత శిక్షణ తరువాత పల్నాడు జిల్లాలోని కొన్ని కంపెనీలు, పరిశ్రమల్లో ప్లేస్మెంట్ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 15-35 ఏళ్లవారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం కిరణ్ నాయక్ రామావత్ : 784274768 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌ల పంపిణీ చేస్తున్నట్టు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. కొండవీటి పాపయ్య, చిన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చంద్రమౌళీనగర్ భాష్యం విద్యా సంస్థల్లో 42 మందికి రూ.1.50 లక్షలను పంపిణీ చేయగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ కొండవీటి నరసింహారావు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో 10 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగించాలనికోరారు.గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించేందుకు వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో కిలారి రాజన్ బాబు, కొండవీటి నరసింహారావు, పాపారావు, కిషోర్‌బాబు, నూతలపాటి తిరుపతయ్య పాల్గొన్నారు.

రసవత్తరంగా రాయబార సన్నివేశం

- కొణతలతో తరలివచ్చిన వీరాచారవంతులు
- నేడు మందపోరు, చాపకుడు

ప్రజాశక్తి కారంపూడి :

పల్నాటి వీరరాధనోత్సవాల్లో రెండవ రోజైన ఆదివారం రాయబార ఘట్టాన్ని రసవత్తరంగా వీరాలయ ప్రాంగణంలో వీరాచారా పీఠాధిపతి తరుణ్ చెన్నకేశ, పీఠం నిర్వాహకులు విజయ్ కుమార్, వీరాచారవంతులు అలనాటి చారిత్రాత్మక కథా సన్నివేశాలతో రసవత్తరంగా నిర్వహించారు. అలరాజు 'రాయబారం' వికటించుటయే పల్నాటి యుద్ధానికి బీజం పడిందని చారిత్రక కథనం...

మలి దేవాదులు కోడిపందెంలో ఓడిపోవడంతో ముందస్తుగా జరిగిన ఒప్పందం మేరకు బ్రహ్మానాయుడు తన అనుచర గణంతో పలనాటి రాజ్యం వదిలి ఏడు సంవత్సరముల వనవాసంను పూర్తి చేసుకొని మేడపిలో ఉంటారు. గడువుతీరి ఆరు నెలలు కావడంతో రాజ్యాన్ని తిరిగి పొందేందుకుగాను నలగామ రాజు అల్లుడు, పేరేం దేవి భర్త అయిన అలరాజును రాయబారిగా బ్రహ్మానాయుడు గురజాలకు పంపుతారు. గురజాల రాజ్యాన్ని నలగామ రాజు పాలిస్తుండగా, మంత్రిగా నాయకురాలు నాగమ్మ రాజ్య పాలన సాగిస్తున్నారు. అలరాజును గురజాలకు రాయబారిగా బ్రహ్మానాయుడు పంపే సమయంలో అలరాజు తల్లి చెల్లెమ్మ ఇలా అంటుంది.. వీరా గ్రేసులైన పెద్ద బాలరాజును గాని, నీ మానస పుత్రుడు, రాజ్య సైన్యాధ్యక్షుడు కన్నమ దాసుని గాని, నీ కుమారుడు బాలచంద్రుని గాని రాయబారానికి పంపవచ్చు కదా... అంటూ పేర్కొంటుంది.

కోడి పందేలు గురజాల వారు చేసిన మోసం, దుర్మార్గం తెలిసినా ధర్మం పేరిట మనల్ని ఓటమి అంగీకరించమన్నప్పుడు నిష్పక్షపాతంగా వ్యవహరించిన ధర్మమూర్తి అలరాజు అని బ్రహ్మానాయుడు కొనియాడుతారు. అల రాజుకు అంగరక్షకుడిగా నా మానస పుత్రుడైన కన్నమదాసును అంగరక్షకుడిగా పంపటమే కాకుండా మహిమానిత్వమైన 'తులసి మాలను' ధరింప చేసి గురజాలకు రాయబారం పంపుతానని బ్రహ్మానాయుడు, అలరాజు తల్లికి తెలపటంతో ఆమె అంగీకరిస్తుంది. రాయబారానికి వెళ్లినవారు మార్గమధ్యంలో కండ్లేరును దాటవలసి వస్తుంది. ఆ మార్గంలోనే బాలచంద్రుడు అటుగా వస్తారు. ఏరు దాటి విషయంలో బాలచంద్రుడు సరదాగా పందెం కద్దామని అలరాజు తో పేర్కొంటారు. పందెంలో ఓడిపోయిన వారు నిలువు దోపిడీ ఇవ్వాల్సిందిగా వీరి ఇరువురి మధ్య ఒప్పందం. పందెంలో అలరాజు ఓడిపోవడంతో అన్ని ఆభరణాలతోపాటు బ్రహ్మానాయుడు మెడలో వేసిన తులసి మాలను కూడా తీస్తారు. తదుపరి అలంకరణ పూర్తి వెళ్లే సమయంలో అలరాజు తులసిమాలను మర్చిపోయి గురజాలకు కన్నమదాసుతో కలిసి వెళ్తారు. గురజాల రాజు నలగామ రాజు, మంత్రి నాయకురాలు నాగమ్మ ఇరువురు దౌత్యమనకు సహకరించకపోగా 'సూది మూపినంత నేలను కూడా ఇవ్వమని' నలగామ రాజు కొపోద్రేకంగా పేర్కొంటారని కథనం. ఈ క్రమంలో అల రాజు సహనానికి విలువ లేకుండా పోయింది... పలనాటి రక్తం ఏరులై పారవలసిందే... యుద్ధ ప్రకటన చేస్తున్నాను... విజయమో... వీర స్వర్గమో... రణరంగం లో....తేల్చుకుందాం...! అని తన సూర్య బేతాళకు ఖడ్గంను తీసి వీరా వేశమును ప్రదర్శించెను. ఎత్తిన ఖడ్గము దించకూడదు అన్న నియమము చేత రాయబారిగా వచ్చిన విషయాన్ని గుర్తెరిగి సభలోని స్తంభమును తెగ నరికి వారు వెను తిరుగుతారు. మార్గమధ్యంలో నాయకురాలు నాగమ్మ కుతంత్రము చేత తంబళ్ల కొమ్మజీయార్ చే అలరాజును చంపిస్తుంది. అనంతరం మరో మారు గురజాల రాజ్యానికి రాయబారిగా రణబట్టును పంపినా ప్రయోజనం శూన్యం కావడం జరిగింది. అలరాజు రాయబారం వికటించుటయే పల్నాటి యుద్ధానికి బీజం పడిందని చారిత్రాత్మక ఇతివత్తం. ఈ క్రమంలోనే మాచర్ల, గురజాల రాజులు కారంపూడి కేంద్రంగా పల్నాటి యుద్ధానికి సన్నద్ధులయ్యారని చారిత్రక ఇతివృత్తాంతం. ఈ సన్నివేశాలను బ్రహ్మానాయుడు వేషధారణలో పీఠాధిపతి, నలగామ రాజు, నాగమ్మ, ఇతరుల పాత్రలలో వీరాచారవంతులు రక్తి కట్టే విధంగా వీరాలయంలో జరిగిన కథ అంశం ఆకట్టుకుంది.

నేడు మందపోరు, చాపకూడు : పల్నాటి వీరారాధనోత్సవాల్లో మూడవరోజు మందపోరు ఘట్టాన్ని వీరాచార పీఠాధిపతి, వీరాచారవంతులు తమ తమ కొణతములతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాంఘిక సమానత్వం కోసం బ్రహ్మానాయుడు ప్రవేశపెట్టిన చాపకూడు వీరాలయ ప్రాంగణంలో నిర్వస్తారు.



కొణతల ప్రదర్శన

దుమ్ముకొట్టుకుపోతున్న బొప్పూడి..

ప్రజాశక్తి-చిలకలూరిపేట : మండలంలో ఉన్న గ్రామాల్లో బొప్పూడి నుండి ఎక్కువ ఆదాయం వస్తుంది. గ్రానైట్, పునాది రాళ్లు, శ్లాబ్‌లో వాడే కంకర రాళ్లు, రహదార్లకు మట్టి, గ్రావెల్ వంటివి ఈ గ్రామానికి చుట్టుపక్కలున్న క్వారీల నుండే సరఫరా అవుతుంటాయి. వీటన్నింటినీ వివిధ ప్రాంతాలకు తరలించడం కోసం ఈ గ్రామానికి వందల సంఖ్యలో లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే స్థానికులకు తలనొప్పులు తెస్తోంది. క్వారీల నుండి నిత్యం కొండరాళ్ల పగుళ్ల శబ్దాలతో స్థానికుల గుండెలు అదరడంతోపాటు రోడ్లు సరిగా లేని కారణంగా వాహనాలు వచ్చివెళ్లే క్రమంలో దుమ్ము భారీగా లేచి గ్రామాన్ని కమ్మేస్తోంది. రహదారికి పక్కన, సమీపంలోని ఇళ్లపైన, పొలాల్లోని పైరుపైన, చెట్లపైన దుమ్ము పేరుకుపోవడం ఒకెత్తయితే ఆహార పదార్థాలనూ దుమ్ము చుట్టుముడుతోంది. వ్యాపారంతో ఆదాయం దండిగా వస్తుండడమే కాకుండా నియోజకవర్గ కేంద్రమైన చిలకలూరిపేట పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. చిలకలూరిపేట నుండి బొప్పూడి మీదగా గోపాలవారిపాలెం వెళ్లడానికి, బొప్పూడి నుంచి మురికిపూడి వెళ్లడానికి, మద్దిరాల మీదగా సాతులూరు వెళ్లడానికి అనువైన రహదార్లు లేవు. పలు ప్రసిద్ధి గాంచిన ఆలయాలూ ఈ గ్రామంలో ఉండడంతో సందర్శకుల రాకపోకలు అధికమే. వివిధ సందర్భాల్లో గ్రామానికి వచ్చేవారు సరైన రహదారుల్లేక, గుంతల మార్గాల్లో వచ్చి వెళ్లడానికి అవస్థ పడడం ఒకెత్తయితే వచ్చిన తర్వాత ఇక్కడ దుమ్ము, రహదార్ల వెంట వ్యర్థాల దుర్గంధంతో అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానికులు సైతం ఈ దుర్గంధాన్ని నిత్యం తాము భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఆదాయానికి కొదవలేని గ్రామంలో అభివృద్ధి మాత్రం నామమాత్రంగా ఉందనే అసతృప్తి స్థానికుల్లో నెలకొంది. క్వారీల్లో ఎప్పుడంటే అప్పుడు కాకుండా పగటి వేళల్లోనే పేలుళ్ల జరిగేలా చూస్తే తమకు శబ్ధతీవ్రత తక్కువగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. రహదార్లను సైతం అభివృద్ధి చేయడం ద్వారా దుమ్మును నియంత్రించాలని, రోడ్ల పక్కన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. మురుగునీటి పారుదల సౌకర్యం, వీధి దీపాల ఏర్పాటుపైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలంటున్నారు.



ఆట, వ్యాయామం అలవాటుగా మారాలి

(మొదటి పేజీ తరువాయి)

తమ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఏదో ఒక వ్యాయామం, క్రీడ అలవాటుగా చేసుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో క్రీడాస్ఫూర్తి ముఖ్యమన్నారు. పోలీసులు కలిసి కట్టుగా సమన్వయంతో విజయం సాధించాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, పతకాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఎఫ్ఓ కృష్ణప్రియ, అడ్మిన్ ఎస్పీ జెవి.సంతోష్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, డీఎస్పీలు హనుమంతరావు, నాగేశ్వరరావు, మహాత్మ గాంధీరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కెవిడి రామారావు పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా నాకు వాట్సప్ చేయండి

(మొదటి పేజీ తరువాయి)

తరచుగా పురుగులు రావడంపై అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడం లేదని, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, మరుగుదొడ్లు క్లీనింగ్ వంటి ఇతర అంశాలనూ వివరించినట్లు సమాచారం. ఈ సమస్యలపై గతంలో వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమను లక్ష్యంగా చేసుకుని హాస్టల్ అడ్మిషన్ కూడా ఇవ్వకుండా బెదిరించారని కొందరు చెప్పినట్లు తెలిసింది. ఇప్పుడు కూడా అదేవిధంగా చేస్తారే ఆందోళననూ వెలిబుచ్చినట్లు సమాచారం. దీనికి సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను, బెదిరింపులను తన దృష్టికి తేవాలంటూ వాట్సప్ నంబర్ ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం సబ్ కలెక్టర్ మీడియాతో తమ దృష్టికి విద్యార్థినులు పలు సమస్యలు తీసుకొచ్చారని, దీనిపై ప్రభుత్వానికి సోమవారం నివేదిక ఇస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
సోమవారం 2 డిసెంబర్ 2024

అవినీతి ఆదానీని అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

అవినీతి ఆదానీని అరెస్టు చేయాలని సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఒప్పందంలో ఆదాని నుంచి రూ.2,029 కోట్లు ముడుపులు ప్రజాప్రతినిధులు, అధికారులకు అందినట్లు అమెరికాలో కేసు నమోదు అయిందని చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నోరు మెదపడం లేదని విమర్శించారు. సెకి కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంపదను దోచి పెడుతున్న పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, ఎం రవి, ఈమని అప్పారావు, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వై కమలాకర్, పట్టణ కమిటీ సభ్యులు ఎం చలపతిరావు, ఎస్ గణేష్, టి శ్రీరాములు, ఎం నాగేశ్వరావు, ఆర్ వేణు, ఎం శివచంద్రరావు, జే బ్రాహ్మణి, తదితరులు పాల్గొన్నారు.



ముంపు సమస్య లేకుండా చేస్తా : ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ఆక్రమణల తొలగింపునకు ప్రజలు, వ్యాపార వర్గాలు సహకరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 33,34 డివిజన్‌లోని ఫాతిమాపురం, దేవాపురంలో ఆదివారం ఆమె విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. దేవాపురంలో ఆక్రమణల కారణంగా డ్రైనేజీ వ్యవస్థ కుచించుకొని పోయిందని గుర్తించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి గతంలో ఈ ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు కల్వర్టులు కుంగి పగుళ్ల ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయని, ఈ డ్రైనేజీ లైన్ లోనే కేబుల్స్, పైప్ లైన్లు వెళ్ళటం వలన నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయని గుర్తించి, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తొలగించామని తెలిపారు. దేవాపురంలో 5 చోట్ల కల్వర్టులు అవసరం అని గుర్తించి, గతంలో కంటే ఎత్తు వెడల్పును పెంచి చేపట్టిన పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. మరోచోట రిటైనింగ్ వాల్ అవసరం అని గుర్తించి,అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఆక్రమణల వలన వరద నీరు దేవాపురంను ముంచెత్తుతుందని కనుక పీకలవాగు డైవర్షన్ ఆక్రమణల తొలగింపు మీద దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో దేవాపురం వంటి ప్రాంతాలకు వరద ముప్పు ఉండదని, ఈ ఆక్రమణల తొలగింపుకు ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని మాధవి కోరారు. కార్యక్రమంలో ఈరాంటి వర ప్రసాద్, పోపూరి నరేంద్ర, దగ్గు కిరణ్, చిన్న బాజీ, పఠాన్ అస్మ, ఉప్పుటూరి పేరయ్య, కొణికి వినోద్, మన్నయ్య, అన్వర్,ప్రశాంత్ పాల్గొన్నారు.

5న ఢిల్లీలో బిసి సంక్షేమ సంఘం ధర్నా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

2025 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనతోపాటు సమగ్ర కులగణన జాతీయస్థాయిలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 6న నిర్వహించబోయే అఖిలపక్ష సమావేశంలోనూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. దేశంలోని ప్రతి సామాజిక వర్గాన్నీ లెక్కించేలా ప్రత్యేక ఫార్మెట్లో ప్రజలందరి జనగణన జరపాలన్నారు. ఓబీసీల సమగ్ర అభివద్ధితోనే దేశాభివద్ధి ముడిపడిఉందన్నారు. ఈ నేపథ్యంలో ఓబీసీ జీవన స్థితిగతులు తెలిపేలా జాతీయ స్థాయిలో జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమగ్ర కులగణన జరపడం ద్వారా ఆయా సామాజిక వర్గాలు ఏ మేరకు వెనుకబడి ఉన్నాయో లెక్కించడం సులభతరం అవుతుందన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ ఇందుకు సముఖంగా ఉన్నాయని చెప్పారు. జనగణనతోపాటే కులగణనుకు హామీ ఇచ్చిన బీజేపీ అగ్రనాయకులు.. ఇప్పుడు సమగ్ర కులగణన చేపడితే జాతీయ సమగ్రత దెబ్బతింటుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కుల గణనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని, జనాభా దామాషా మేరకు ఓబీసీ రిజర్వేషన్లు పెంచేలా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై మహోద్యమ నిర్మాణానికి తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు మహేష్, తెనాలి నియోజకవర్గం అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కుర్ర శ్రీనివాసరావు, శివాజీ, కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ నేతలు

రసాయన ఎరువులు హానికరం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. వట్టి చెరుకురు మండలంలో ఆదివారం రైతులకు జీవన ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. 20 కిలోల పశువుల ఎరువులో 250 గ్రాముల ట్రైకోడెర్మా కలిపి, కొంచెం నీళ్లను వేసి బాగా కలిపి, ఆ మిశ్రమాన్ని నీడలో 7-10 రోజులు పాటు ఉంచాలని వివరించారు. ఈ మిశ్రమాన్ని ఒక ఎకరం భూమిలో దున్నేటప్పుడు వేయడం వల్ల నేల నుంచి సంక్రమించే తెగుళ్లను నిరోధించవచ్చని చెప్పారు. భూమిలో హార్మోన్లు, ఖనిజ లవణాలు అందుబాటులో ఉంచి మొక్కల పెరుగుదలకు కషి చేస్తాయని తెలిపారు.

ఆస్టియోపోరోసిస్‌పై అవగాహన సభ

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బంది పెట్టే ఆస్టియో పోరోసిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కార్తీక్ కోట అన్నారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో డాక్టర్ ఆర్.రామచంద్రరావు అధ్యక్షతన ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ కోట మాట్లాడుతూ ఎముకలకు సంబంధించి ఆస్టియోఫోరోసిస్ ప్రధానమైనదని, ఆస్టియో ఫోరోసిస్ ఉన్న వారికి పైకి ఏ బాధలూ తెలియవని, కానీ చిన్న దెబ్బకే ఎముకలు విరిగిపోతాయని అన్నారు. ఈ వ్యాధిలో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని, ఎముకలు అతి తేలికగా విరిగిపోతాయని, వెన్నుపూసలు, పక్కటెముకలు, మణికట్టు దగ్గర ఎముకలు ఆస్టియోఫోరోసిస్ వల్ల విరుగుతాయన్నారు. ఈ వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం మేలని అన్నారు. ఆహారంలో క్యాల్షియం, విటమిన్-డి ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజూ వ్యాయామం చేస్తుంటే ఆస్టియో ఫోరోసిస్ రాకుండా నివారించవచ్చన్నారు. కీళ్ల బాధల్లో రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒక ఒక ప్రత్యేకమైందని, దీని వల్ల ముఖ్యంగా చిన్న జాయింట్లు ఎక్కువ వ్యాధిగ్రస్తం అవుతాయన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ బాధలు దీర్ఘకాలంగా ఉంటాయని, ఈ వ్యాధి ఉన్న వాళ్లకు ఉదయం లేస్తూనే కీళ్ల బాధతతో సతమతం అవుతారని, నీరసపడిపోతారన్నారు. అటువంటి వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం డాక్టర్ కార్తీక్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భూములను దోచేస్తున్న స్వామీజీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజలకు చెందాల్సిన భూములను దోచేస్తున్న స్వామీజీలపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు సైతం స్వామీజీల వద్ద మోకరిల్లడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నెల్లూరులో రామదూత బాబా గత 25 సంవత్సరాల నుంచి వేలాది ఎకరాల భూములు స్వాహా చేస్తున్నా ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అయినా జోక్యం చేసుకుని రామదూత భూములు స్వాధీనం చేసుకోవాలని కోరారు. స్వరూపానంద స్వామి కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండతో ప్రజలకు చెందిన కొన్ని భూములు కాజేశారని ఆరోపించారు. ప్రజల ఆస్తులు కాపాడే విషయంలో ఉదాసీన వైఖరి ఆలంబిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎం. లక్ష్మీనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు కర్నూలు రాష్ట్ర రహదారి మార్గంలో నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన కమల్ (14) సంఘటన స్థలంలో మృతి చెందాడు. రూరల్ సీఐ హైమారావు తెలిపిన వివరాల ప్రకారం కోటప్పకొండ వైపు నుండి పెట్లూరివారిపాలెం వద్ద మూల మలుపు వద్ద లారీ రాగానే గ్రామానికి చెందిన మిట్ట రామారావు కుమారుడు కమల్ (14) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపు తప్పిన ద్విచక్ర వాహనం లారీ కిందకు దూసుకుపోయింది. ఘటనలో కమల్ తలకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కమల్ నరసరావుపేట పట్టణ సమీపంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో 10 వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ గ్రామీణ పోలీసు స్టేషన్లో లొంగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్ కు తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుని తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని పెదపరిమిలోని చెరువులో ఆదివారం అత్తోట మధు (45) అనే వ్యక్తి గల్లంతయ్యాడు. ఫైర్ సిబ్బందితో పాటు రాయపూడికి చెందిన గజ ఈతగాళ్ళు చెరువులో గాలించి మధు మృతదేహాన్ని వెలికితీశారు. మధు ప్రైవేట్ బస్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తులో చెరువులో పడి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బారెడ్డి మరణానికి సంతాపం

ప్రజాశక్తి- భీమవరం

ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి చాలా బాధాకరమని, ప్రజానాట్యమండలి రాష్ట్ర సాంస్కృతిక ఉద్యమం... ఉత్తమ నటుడు, ప్రతిభావంతమైన దర్శకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఈలోటు పూడ్చలేనిదని, దీర్ఘకాలంగా ప్రజా నాట్యమండలిలో ప్రజా కళాకారుడుగా సేవలందించిన సుబ్బారెడ్డికి జోహార్లు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుబ్బారెడ్డి మృతికి తీవ్ర సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


మాట్లాడుతున్న సాంబశివరావు

కొడాలి గోపాలరావు కృషి చిరస్మరణీయం

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ నాటక రంగ వికాసానికి నాటక రచయితగా కొడాలి గోపాలరావు కృషి చిరస్మరణీయం అని నాటక రంగ పరిశోధకులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. గుంటూరులో నిర్వహిస్తున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై జరిగిన కొడాలి గోపాలరావు నాటక సాహిత్యంపై డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు ప్రసంగించారు. గ్రామసీమల్లోని రైతులు, రైతు కూలీల సమస్యలను కొడాలి తన నాటకాల్లో బలీయంగా చిత్రించారన్నారు. తెలుగు నాటక రంగంలో కొడాలి, కొర్రపాటి గంగాధరరావు, శతాధిక నాటక రచయితలుగా గుర్తింపు పొందారన్నారు. ఈ సభకు రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించారు. సభలో నాటక రచయిత నాగభూషణం, బి.రవి, మృత్యుంజయరావు, పి.మల్లిఖార్జున రావు, ఎస్.హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృషి, పట్టుదలతో విజయాలు సొంతం

కస్టమ్స్, సెంట్రల్ జిఎస్‌టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దృఢమైన సంకల్పంతో, కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని కస్టమ్స్, సెంట్రల్ జిఎస్టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరులోని భాష్యం ఆడిటోరియంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి సాదు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీవిద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అతి పేదరికం అనుభవిస్తూ దృఢమైన సంకల్పంతో అత్యున్నత స్థాయికి ఎదిగిన కట్టా సింహాచలం, రేవు ముత్యాలరాజు, ఎన్. బలరామ్ నాయక్, గోవింద్ జైస్వాల్, బి. రాజకుమారి లాంటి ఉన్నతాధికారుల అభివద్ధి క్రమాన్ని స్ఫూర్తిదాయకంగా వివరించారు. బాల బాలికలు మంచి అలవాట్లు, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని, నమ్మకంతో కృషి చేస్తుంటే తోడ్పాటును అందించే మహనీయులు ఎందరో ఉన్నారన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, మానవత చైర్మన్ పావులూరి రమేష్ , మానవత కార్యదర్శి కె. సతీష్, మానవత అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు సంస్థకు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మానవత ప్రతినిధులు ఉప్పల సాంబశివరావు, చావ శివాజీ, వర్రె సుబ్రహ్మణ్యం, టి ధనుంజయ రెడ్డి, కె ఆనంద్, ఎన్ సాంబశివరావు, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు ప్రసంగించారు.



మహాభారతాన్ని తలపించేది పల్నాటి చరిత్ర : ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - కారంపూడి

మహాభారతాన్ని తలపించేది పల్నాటి చరిత్రని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రెండోరోజు ఉత్సవాల్లో ఆయన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి పాల్గొని రాష్ట్రస్థాయి ఎండ్ల పందేలను ప్రారంభించారు. స్థానిక అంకళమ్మ దేవాలయాన్ని సందర్శించారు. వీర్లదేవాలయంలో పల్నాటి యుద్ధం సమయంలో ఆనాటి వీరులు వాడిన కోణతములను సందర్శించారు. సర్పంచ్ సరస్వతిభాయి బాలునాయక్, డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, వై.కేశవరెడ్డి, కె.శివారెడ్డి, పి.అంజయ్య, యు.లక్ష్మినారాయణ, పి.పుల్లయ్య, కె.బాలకృష్ణ, జె.గంగారావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కెఎస్‌కు ఆర్‌ఎంపి (ఐ)-పిఎంపి ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపి (ఐ) - పీఎంపీ సంఘం నరసరావుపేట డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 8న కోటప్పకొండలో నిర్వహించే రాష్ట్ర మహాసభకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావును సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు పత్రాన్ని ఎమ్మెల్సీకి సంఘం నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి షేక్ సైదా, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, పట్టణ కమిటీ కార్యదర్శి వెంకట్రావు, సభ్యుడు నాగరాజు తదితరులు ఆదివారం నరసరావుపేటలో కలిసి అందజేశారు. ఆర్.ఎం.పి, పీఎంపీలకు ప్రభుత్వం ద్వారా చట్టపరమైన గుర్తింపుని కల్పించాలని, మధ్యలోనే నిలిచిపోయిన శిక్షణ తరగతులను తిరిగి ప్రారంభమయ్యేలా చూడాలని ఆర్ఎంపి, పిఎంపిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తోడ్పాటునివ్వాలని నాయకులు కోరారు.





ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఎయిడ్స్ నివారణకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఎయిడ్స్ పై పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ.. ఉపాధ్యాయ హక్కుల సాధన..

- పేదరికం ఎక్కువ.. అక్షరాస్యత తక్కువగా పల్నాడు జిల్లా
- పాఠశాల్లో ఉపాధ్యాయుల భర్తీ, పీజీ కాలేజీ ఏర్పాటు అవసరం
- యుటిఎఫ్ పల్నాడు జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఉద్ఘాటన - ఉపాధ్యాయుల భారీ ర్యాలీ



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు... ఇన్‌సెట్లో ఎమ్మెల్యే అరవిందబాబు



నాయకులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణరావు



జెండాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఎన్నో పోరాటు చేసి విజయాలు సాధించిందని, 50 ఏళ్ల సుదీర్ఘ పయనంలో 15 మందికి పైగా ముఖ్యమంత్రులను సంప్రదించి ఉపాధ్యాయుల హక్కుల సాధన, విద్యారంగాన్ని బలోపేతానికి కృషి చేసిందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ ఆదివారం ప్రారంభమైంది. ముందుగా కళాశాల ప్రాంగణంలో ఎస్‌టిఎఫ్ఐ, యుటిఎఫ్ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం చెన్నుపాటి లక్ష్మయ్య, మైనేని వెంకటరత్నం, అప్పారి వెంకటస్వామి, రామిరెడ్డి, నాగటి నారాయణ, ఎంఎకె.దత్, షేక్ సాబ్జి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులు అర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల నుండి గడియార స్తంభం సెంటర్ వరకు వర్షంలోనే భారీ ర్యాలీ కొనసాగింది.

అనంతరం కళాశాల ఆడిటోరియంలో ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 800 ఏళ్ల క్రితమే కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కటే అని చాపకూడు సిద్ధాంతం ద్వారా చాటిన పల్నాడు ప్రాంతం నేడు ఆర్థిక, జీవన, విద్య తదితర రంగాల్లో వెనుకబడిందని చెప్పారు. పేదరికం ఎక్కువ, అక్షరాస్యత శాతం తక్కువగా ఉందన్నారు. జిల్లాలో 65 శాతంగా ఉన్న అక్షరాస్యతను పెంచాల్సిన బాధ్యత యుటిఎఫ్‌పై ఉందన్నారు. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ రంగంలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులు లేరన్నారు. 1985 వరకు అందరూ ఉచితంగా చదువుకున్నారని, 1991 నుండి నూతన ఆర్థిక విధానాల కారణంగా విద్య కొనుక్కోవడం ప్రారంభమైందని వివరించారు. విద్య, వైద్యాన్ని 50 శాతంపైగా ప్రైవేటీకరణ చేశారని ప్రభుత్వాలను విమర్శించారు. కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానంతో పేదలకు విద్య అందే పరిస్థితి లేదన్నారు. విద్యారంగంలోనూ మతాన్ని జొప్పించారని, ఈ విధానాలను గత ప్రభుత్వం గుడ్డిగా ఆమోదించిందని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే విద్యారంగం కొనసాగితే సామాజిక న్యాయం జరుగుతుందని, రాజ్యాంగం పరిరక్షించబడుతుందని తెలిపారు. దీనికోసం యుటిఎఫ్‌తోపాటు ఇతర ఉపాధ్యాయ సంఘాలూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, చిరు ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల ప్రజల పక్షాన ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించడంలో యుటిఎఫ్ కీలక పాత్ర పోషించాలన్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధైర్యవంతులు, నిజాయితీ పరులే ఎర్రజెండా పట్టుకుంటారన్నారు. పాలకులు, నాయకులు నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేస్తే సమాజం కూడా ఇదే తరహాలో నడుస్తుదన్నారు. యుటిఎఫ్‌లో అంకితభావంతో పనిచేసిన వారిని చూసి ఎంతోమంది యుటిఎఫ్ జెండా పట్టుకుని ఉద్యమిస్తున్నారని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యం కోసం వ్యవస్థీకృతంగా పోరాడటం యుటిఎఫ్ నైజమన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఉద్యోగులు అనుభవిస్తున్న రాయితీలు, హక్కులు యుటిఎఫ్ చేసిన పోరాటాల ఫలితమేనని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలన్నారు. విద్యార్థి జీవితం తరగతి గదిలో ప్రారంభమవుతుందని, వారు ఉపాధ్యాయులును మార్గదర్శకులుగా తీసుకుని వారువేసే బంగారు బాటలో నడవాలని సూచించారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాలకు యుటిఎఫ్ మద్దతుగా నిలిచిందని, ఆర్థిక సహకారమూ అందించిందని చెప్పారు. సభలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు పి,ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ఎడిటర్ కుమార్ రాజా, స్టేట్ ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు, జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, ఎ.భాగేశ్వరిదేవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడియాల రమేష్, యుటిఎఫ్ నాయకులు, జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ నుండి రైతులకు అందని సహకారం

- కీలక సమయంలో నిలిచిన తాళ్లూరు సహకార సంఘం లావాదేవీలు
- రైతులకు దక్కని పంట రుణాలు



తాళ్లూరు సొసైటీ కార్యాలయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ సామెతలాగా తాళ్లూరు సొసైటీ దుస్థితి మారింది. రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వటానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటయ్యాయి. అందులో భాగంగానే తాళ్లూరు సొసైటీ (పరస, తాళ్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్) ఏర్పడింది. గతంలో మండలంలో రెండు సొసైటీలుండగా రెండింటినీ కలిపి ఒక్కటి చేశారు. పాలకుల తప్పిదాలు, స్థానిక సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సంఘం లావాదేవీలు స్తంభించాయి. ప్రతి సంవత్సరం సొసైటీలను ఆడిట్ చేయించి నివేదికలను ఆదాయపు పన్ను శాఖకు సమర్పించాలి. అయితే గొళ్లెం వేసాము.. తాళం మరిచాము.. అన్నట్లు 2017 ఏప్రిల్ ఒకటి నుండి ఇప్పటి వరకు ఆదాయ పన్ను శాఖకు వివరాలు సమర్పించలేదని ఆ శాఖ అధికారులు నవంబర్ 7వ తేదీన సొసైటీ ఖాతాలను సీజ్ చేశారు. దీంతో సొసైటీ లావాదేవీలు నిలిచిపోయాయి.

ఐదు సార్లు నోటీసులు

సొసైటీ నివేదికలు పంపాలని ఆదాయపు పన్ను శాఖ ఐదుసార్లు నోటీసులు పంపినా స్థానిక సిబ్బంది స్పందించలేదు. దీంతో ఈనెల 7వ తేదీన లావాదేవీలు జరగకుండా జీడీసీసీ పెదకూరపాడు బ్రాంచ్ నందు షట్‌డౌన్ చేశారు. ఈ ఖాతాలన్నీ ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆదేశాలు ఇస్తేనే తెరుచుకునే అవకాశం ఉంది. పాలకవర్గ కమిటీలు లేకపోవడం, ఆలస్యంగా ప్రభుత్వం పిఎసిఎల్‌ను నియమించటంతో రుణాలు ఇవ్వటం ఆలస్యంగా ప్రారంభమైంది. రికవరీలు తక్కువగా ఉన్నాయని రుణాలు ఇవ్వడం కొన్ని నెలలు నిలిపివేశారు. అనంతరం రికవరీలు పెంచారు. నెల రోజుల నుండి రుణాలు ఇవ్వడం ప్రారంభించారు. ఇంతలోనే ఆదాయ పన్ను శాఖ రూపంలో మరోమారు రైతులకు రుణాలిచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

త్వరలోనే లావాదేవీలు పునరుద్ధరణ

సొసైటీకి సంబంధించి లావాదేవీలను త్వరలో పునరుద్ధరిస్తామని తాళ్లూరు సొసైటీ సెక్రెటరీ కుమారి తెలిపారు. కొత్త కావడం, గత మూడేళ్ల నుంచే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి సొసైటీలను తీసుకురావడం వల్ల నివేదికలు పంపడం సమస్యగా మారిందన్నారు. లావాదేవీలను పునరుద్ధరించిన వెంటనే రైతులకు సేవలందిస్తామని, నవంబర్ 26 నుండి అప్పు చెల్లించే రైతులు దగ్గర నుండి జమ చేసుకునే అవకాశం ఇచ్చారని తెలిపారు.

ఆదాయపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలి

నిలిపేసిన సొసైటీ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని రైతుసంఘం పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు కోరారు. సొసైటీలకు ఆదాయపన్ను నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. కేంద్రం తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాల కారణంగానే సొసైటీలను ఆదాయ పన్ను జాబితాలోనికి తెచ్చారని పేర్కొన్నారు. రైతులకు రుణాలివ్వాల్సిన సమయాల్లో లావాదేవీల స్తంభన సరికాదని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాల్రావు అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేయాలి : సిపిఎం

13 మందితో మంగళగిరి పట్టణ నూతన కమిటీ, కార్యదర్శిగా వివి జవహర్లాల్ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న కాలంలో పాలకవర్గాలు అవలంబిస్తున్న విధానాల వలన ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటారని ఆ సమస్యల పరిష్కారానికై ప్రజా ఉద్యమాలు, పోరాటా లను ఉధృతం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం మంగళగిరి పట్టణ 24వ మహాసభ మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మున్నంగి సుబ్బారావు నగర్‌లో నిర్వహించారు. మహాసభకు వివి జవహర్లాల్, పి బాలకృష్ణ, జె బ్రాహ్మణి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకొని అనేక సంవత్సరాలుగా నివాసముంటున్న 4000 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రాజధాని ప్రాంతంలో మంగళగిరి పట్టణానికి చెందిన 6000 మందికి గత ప్రభుత్వం సెంటు స్థలం కేటాయించిందని వారందరికీ నివాస ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. టిడ్కో గృహాల సముదాయాన్ని ముంపు నుండి కాపాడటానికి డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్మాణం చేయాలని, చేనేత కార్మికులకు బడ్జెట్లో రూ.2000 కోట్లు నిధులు కేటాయిం చాలని, నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని మహాసభ తీర్మానించింది. మహాసభలో పాశం రామారావు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించడం లేదని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు దాడులు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ఇండియా వేదిక ఏర్పాటు చేయడంలో సిపిఎం కీలక పాత్ర వహించి, గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బలాన్ని కొంతమేర తగ్గించడం జరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో టిడిపి, పవన్ కళ్యాణ్, బీహార్లో నితీష్ కుమార్ పార్టీల ఎంపీల మద్దతుపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధారపడి ఉందని అన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడం లేదని విమర్శించారు. ఉచిత ఇసుక అమలు చేయడం లేదని అన్నారు. మద్యం షాపుల వలన బెల్ట్ షాపులు పెరిగి విపరీతంగా మద్యం అమ్మకాలు పెంచుకున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వానికి, టిడిపి కూటమి ప్రభుత్వానికి తేడా లేదని విమర్శించారు. అమరావతి రాజధానికి అప్పు పేరుతో రూ.15 వేల కోట్లు వివిధ సంస్థల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇప్పించడం దారుణమన్నారు. గ్రాంట్‌గా ఇవ్వాల్సింది పోయి అప్పుగా ఇప్పించడం ఏమిటని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో ప్రతి విషయాన్ని మతపరం చేసి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మించి ఇస్తామని మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు వాగ్దానం చేశారని వాటిని



మహాసభలో మాట్లాడుతున్న పాశం రామారావు

అమలు పరచాలని డిమాండ్ చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో అనేక పోరాటాలు చేసి అనేక కాలనీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఆ కాలనీలకు పట్టాలు ఇచ్చి పేద ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి స్థలం లేకుండా చేయడానికి ఆనాటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని తిప్పి కొట్టడం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో మంగళగిరిలో అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు, ఎం రవి, జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ చిస్టి, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. మహాసభ ప్రారంభం సందర్భంగా సిపిఎం జెండాను సీనియర్ సభ్యులు ఈ కాటమరాజు ఆవిష్కరించారు. సిపిఎం నేత సీతారాం ఏచూరి, ఇటీవల మృతి చెందిన నాయకులకు మహాసభ నివాళులర్పించింది.

సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శిగా వివి జవహర్లాల్

సిపిఎం మంగళగిరి పట్టణ 24వ మహాసభ 13 మందితో నూతన కమిటీ, పట్టణ కార్యదర్శిగా వివి జవహర్లాల్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్ ఎస్ చెంగయ్య, వై కమలాకర్, ఎం బాలాజీ, పట్టణ కమిటీ సభ్యులుగా ఎస్ గణేష్, ఎం చలపతిరావు, టి శ్రీరాములు, టి శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, ఎం నాగేశ్వరావు, ఆర్ వేణు, ఎం శివచంద్రరావు, జే బ్రాహ్మణిలను ఎన్నుకున్నారు.

48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ

తుపాను నేపథ్యంలో ధాన్యం రైతులకు మంత్రి భరోసా

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రతికూల వాతావరణం కారణంగా నిరాశ చెందుతున్న రైతులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక ఐతానగర్, లింగరావు సెంటర్లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, వాతావరణం ప్రతికూల పరిస్థితులపై రైతులకు ధైర్యాన్ని నింపారు. రైతులకు అందుతున్న సహాయక చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తూపాను హెచ్చరికలు, వాతావరణంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు తమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతులుపట్ల చిత్తశుద్ధితో ఉందన్నారు. పండించిన పంటను జిల్లాలో ఎక్కడైనా విక్రయించే విధంగా వసతులు కల్పించామన్నారు. పంట విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నుల పైచేలుకు కొనుగోళ్ళపై నగదు చెల్లింపు జరిగిందన్నారు. 25శాతం తేమకలిగిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రైతులను ఇబ్బంది పెట్టిన మిల్లర్లను బ్లాక్


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

లిస్టులో పెడతామన్నారు. వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ అందేల అన్నివిధాల ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఏడిఏ ఎన్ ఉషారాణి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు, కన్నెగంటి మురళి కృష్ణ, ఈదర పూర్ణ చంద్, మేకల చిట్టిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవి రహిత సమాజ సాధనకు కృషి చేయాలి



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ, సిబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు

మన ఆరోగ్యం మన చేతుల్లో వుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా డింఎహెచ్ఒ కార్యాలయం నుండి స్టాల్ గర్ల్స్ స్కూల్, హిందూ కాలేజీ కూడలి మీదుగా ఉమెన్స్ కాలేజీ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఒ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉమెన్స్ కాలేజిలో నిర్వహించిన కార్యక్రమంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ 'హక్కుల మార్గాన్ని అనుసరించండి – నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదంతో ఎయిడ్స్ దినం జరుపుకుంటున్నామని తెలిపారు. యువత హెచ్ఐవిపై అవగాహన పొంది హెచ్ఐవి లేని సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్ఐవితో జీవించేవారిపట్ల వివక్ష చూపకుండా అందరిలాగే ప్రతి ఒక్కచోట ఆదరించాలని, జిల్లాలో ఏఆర్‌టి సెంటర్లలో హెచ్ఐవితో జీవించేవారికి ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మందులు వాడడం ద్వారా తమ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలని, ఒకవేళ హెచ్ఐవి ఉందని తెలిస్తే సకాలంలో చికిత్స తీసుకుంటే జీవిత కాలాన్ని పెంచుకొని ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఐవి నివారణ, హైపర్ టెన్షన్, షుగర్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇస్మా యిల్, జ్యోతుల వీరాస్వామి, ఉమెన్స్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జె.వి.సుధీర్, డిస్ట్రిక్ట్ జైలర్ ప్రేమ సాగర్ పాల్గొన్నారు.

చిప్స్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు : చేబ్రోలు ఫార్మసీ కాలేజి ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు ఆదివారం దాసరిపాలెం గ్రామంలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ జె.సుబ్బారావు, సిబ్బంది, పాల్గొన్నారు.



నేడు, రేపు నగర కమిషనర్ జైపూర్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు, రేపు రాజస్తాన్ రాజధాని జైపూర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో వీధిదీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవవ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతుల అమలు పరిశీలన, అధ్యయనం కోసం గుంటూరు నగర కమిషనర్ పులి వెళ్లనున్నారు. తిరిగి బుధవారం కమిషనర్ అందుబాటులో ఉంటారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వసతి గృహాల్లో

యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా పనులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని శాతవాహన, గౌతమి, అశోక, అమరావతి, స్కాలర్స్, ఇంజనీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ హాస్టల్స్, లేడీస్ హాస్టల్‌లలో యుద్ధ ప్రాతిపదికన వాటర్ సప్లై పనులు జరిగాయి. దీనిలో భాగంగా అన్ని వసతి గృహాలపై ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ పరిశుభ్రపరిచారు. వర్సిటీ వాటర్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీర్ డి సతీష్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది పనులు పూర్తి చేశారు. బాలుర వసతి గృహాల డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ కే శశిధర్, డాక్టర్ నంబూరు బాబు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బియ్యం దొంగల్ని శిక్షించాలి : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదలకిచ్చే బియ్యాన్ని స్మగ్లింగ్ ద్వారా విదేశాలకు తరలిస్తున్న బియ్యం దొంగల్ని చట్టం ముందు ప్రవేశపెట్టాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. ఆదివారం అరండల్ పేట లోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాణిక్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో వైసిపి నాయకులు పేదల బియ్యాన్ని విదేశాలకు తరలించి రూ. 15 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ కుంభకోణాన్ని వెలికి తీసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని కుంభకోణాలతో పాటు పేదలకు ఇచ్చే బియ్యాన్ని సైతం వదిలి పెట్టలేదని, పేదల బియ్యాన్ని బొక్కినవారి పొట్టలను చీల్చి బియ్యాన్ని రాబట్టాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతేకాక ఇంటింటికి బియ్యాన్ని అందించే వాహనాలు, సంచార పశు వైద్య శిబిర వాహనాలు, ఆరోగ్య శ్రీ, 108, 104 తదితర వైద్య సేవల వాహనాల కొనుగోళ్లలో సైతం వారిద్దరూ భార్య కుంభకోణానికి పాల్పడ్డారని తెలిపారు. వీటిపై ముఖ్యమంత్రి విచారణకు ఉన్నత స్థాయి అధికారులు నియమించిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



9న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చేబ్రోలు

సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో 9న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం వడ్లమూడి లోని బోసు బొమ్మ సెంటర్ వద్ద ఎస్.కే బాజీ అధ్యక్షతన జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం కార్మికుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏంటో అర్థం అవుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే భవనిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువగళం పాదయాత్రలో లోకేష్ వాగ్దానాలు చేసినప్పటికీ ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు పరచలేదన్నారు. తక్షణమే పెండింగ్ క్లైములు పరిష్కరించాలని, రాజధాని నిర్మాణంలో స్థానికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఖాజా మొహిద్దిన్, ఎస్.కె షమీ ఉల్లా,ఎస్ డి సుభాని, ఎస్కే సిలార్షా, ఎస్ కే . ఖోజర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో వినుకొండ

- ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు
- షాపులుగా మారిన వాహన పార్కింగు సెల్లార్లు
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- రోజురోజుకూ జటిలంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి - వినుకొండ
పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. రహదారులపైనే తోపుడు బండ్లు పుట్టుకొస్తున్నాయి. జాతీయ రహదారిపై విగ్రహాలు, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో నిత్యం వినుకొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినుకొండ పట్టణంలో వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులు విస్తరించకపోవడం, పట్టణానికి బైపాస్ రోడ్డు రాకపోవడం, ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారిపైనే పండు, కూరగాయలు, తినుబండారాల చిరు వ్యాపారుల తోపుడుబండ్లు ఉంటున్నాయి. నియోజకవర్గ కేంద్రం కావడం తో నూజెండ్ల, శావల్యాపురం, బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ మండలాల్లోని గ్రామాలతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలతో విపరీతమైన రద్దీ పెరిగింది. గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి కావడంతోకార్లు, బస్సులు, మినీ వ్యాన్లు, భారీ లోడ్లతో లారీలు, టర్బోలు కంటైనర్లు ఇటుగా ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. పట్టణానికి ప్రధాన కూడలి అయిన శివయ్య స్తూపం సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ వాహనాల మలుపు కష్టంగా మారి ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఏనుగుపాలెం రోడ్డు, మెయిన్ బజార్, మార్కాపురం రోడ్డు, నరసరావుపేట రోడ్డు, కారంపూడి వెళ్లే వాహనాలు రంగనాయక స్వామి గుడి వద్ద అన్నీ కలవడంతో పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. వీటితోపాటు రోడ్డు కిరువైపులా వ్యాపార సంస్థల ఆక్రమణలు, మునిసిపల్ డ్రైనేజీపైన అక్రమ నిర్మాణాలు, వాటి ముందు పండ్లు కూరగాయలు రైతుల చిరు వ్యాపారుల తోపుడు బండ్లు ఉండటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.


వినుకొండలో ట్రాఫిక్ పరిస్థితికి నిదర్శనం

ఉదయం సాయంత్రం విద్యార్థులను స్కూళ్లకు తీసుకువెళ్లి, తీసుకువచ్చే స్కూల్ బస్సులు, ఆటోలు, మినీ వాహనాలతో మరింత జఠిలంగా మారుతోంది. మెయిన్ రోడ్డుపై అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. షాపింగ్ కాంప్లెక్స్‌లకు సెల్లార్లు ఉన్నప్పటికీ పార్కింగ్ కోసం ఉపయోగించకుండా.. షాపులు నిర్మించి అద్దెకు ఇవ్వడంతో రోడ్లపైనే చాలామంది వాహనాలను నిలుపు చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు, మెయిన్ రోడ్డు నుంచి వ్యాపార సముదాయ వీధుల్లో రోడ్లకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.






సమన్వయం ఏదీ..?
ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు మునిసిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. ముండ్లమూరు సెంటర్ నుంచి శివయ్య స్తూపం, కారంపూడి, నరసరావుపేట రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి డ్రైనేజీకి వెలుపల వరకు శుభ్రపరిస్తే ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు అంతరాయం ఉండదని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై పెట్టిన తోపుడుబండ్లను డ్రైనేజీ కాలువ దాటకుండా ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని అంటున్నారు. ఆర్టీసీ బస్సులను శివయ్య స్తూపం మలుపుల వద్ద నిలువనీయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించే విధంగా భవన యజమానుల్లో అధికారులు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాల్సి ఉంది. ట్రాఫిక్ నియంత్రణపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే నిత్యం వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు, రోడ్డు ప్రమాదాలు అధికమయ్యే ప్రమాదం ఉంది.



కొత్తూరు ఇకత్‌కు ఎఐ సాంకేతికత

- కేంద్ర హస్తకళల సంస్థ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - విజయపురి సౌత్
మాచర్ల మండలం కొత్తూరు గ్రామంలో ఇకత్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) జోడించే అవకాశాలున్నాయని దక్షిణ భారత కేంద్ర హస్తకళల సంస్థ రీజినల్ డైరెక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. కొత్తూరు వీవర్స్ కాలనీలో ఇక్కత్ హస్తకళాకారులకు మూడు నెలల శిక్షణలో భాగంగా గురు - శిష్య హస్త శిల్పి ప్రశిక్షన్‌తో పాటు డిజైన్ డెవలప్మెంట్ కార్యక్రమాలను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు ఏ తరహా చీరలను, డ్రెస్ మెటీరియల్స్‌ను ఆదరిస్తారో తెలిపే ఏఐ సాంకేతికత కేవలం చెన్నై నిఫ్ట్ సంస్థలో మాత్రమే ఉందని చెప్పారు. వారిని కొత్తూరుకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఏపీలో ఇకత్ క్లస్టర్ కొత్తూరులో మాత్రమే ఉందన్నారు. ఈ కారక్రమంలో హస్తకళా సేవ కేంద్రం రవీంద్ర గౌతం, అపిట్కో సీనియర్ కన్సల్టెంట్ ఐ.శ్రీనివాసరావు, పి.సుధీర్ కుమార్, పున్నా కష్ణ మూర్తి పాల్గొన్నారు.


మహేష్‌బాబు దంపతులకు సత్కారం

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు

ప్రజాశక్తి - క్రోసూరు
విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన క్రోసూరు ఎంపీడీవో మహేష్ బాబు సన్మాన కార్యక్రమాన్ని స్థానిక ముస్లిం షాదీ ఖానాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర మహిళా నాయకులు వేగుంట రాణి, మాజీ యార్డ్ చైర్మన్ కాదు కాశయ్య, అనుముల వెంకట్రామిరెడ్డి, దుద్దుల యోహాను, గుడిపాడు బాషా, హసాను, ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జడ్పీటీసీ సభ్యులు జమీలా గఫూర్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, విశ్రాంత ఈవోపీఆర్డీ శివరామయ్య తదితరులు మాట్లాడారు. అంకితభావం, పట్టుదలతో పని చేసిన ఉద్యోగుల్లో మహేష్‌బాబు ఒకరని కొనియాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలందించారని ప్రశంసించారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎంపీడీవో మహేష్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

రహదారులు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటించారు. ఈ సందర్భంగా వీరవట్నం గ్రామ పరిధిలోని రైతు నగర్‌లో పంచాయతీ నిధులతో గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండలం కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంతర పంటలు రైతుకు లాభదాయకం

ప్రజాశక్తి-ఈపూరు
ప్రకతి వ్యవసాయ విధానంలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. మండలంలోని ఈపూరు, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో ప్రకతి వ్యవసాయ సిబ్బందికి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బొమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన ప్రకతి వ్యవసాయ రైతు పిల్లి సైదారెడ్డి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈపూరులో రైతు నాశన ఏడుకొండలు మిరప, అంతర పంటలను పరిశీలించారు. ముల్లంగి, కొత్తిమీర, బంతి, ఉల్లి వేయడం ద్వారా మిరప పంటకు ఆశించే తామర పురుగు, చీడ పీడల ఉధతి తగ్గిందన్నారు. అనంతరం అమలకుమారి మాట్లాడుతూ.. బత్తాయిలో అంతర పంటలుగా అరటి, మామిడి, సపోటా గోరుచిక్కుడు, బెండ, కాకర, బీర వేసినట్లు తెలిపారు. అంతర పంటలు వేయడం ద్వారా చీడపీడల ఉధతి తగ్గుతుందని చెప్పారు. భూమిని ఏడాది పాటు వివిధ పంటలతో కప్పి ఉంచడం ద్వారా కర్బన శాతం పెరుగుతుందన్నారు. రైతులు అంతర పంటల సాగుకు మొగ్గుచూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంయూలు సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, తిరుపతిరావు,భాస్కరరావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- మాచర్ల
చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస కళ్యాణ్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా పట్టణంలోని గౌడకాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస కళ్యాణ్ మాట్లాడుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ



వైరస్, అక్వైర్డ్ ఇమ్యూన్ డెఫిషియెన్సీ సింద్రోమ్ 2017చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ చట్టం ద్వారా హెచ్ఐవీ వ్యక్తుల హక్కులను పరిరక్షిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, జి.వెంకటేశ్వర్లు, మెడికల్ అధికారి డాక్టర్ ప్రసన్న, న్యాయవాది బి.అనిల్ కుమార్, జి.వరప్రసాద్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వివేకానంద రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఎంవీ రెడ్డి ఆసుపత్రి అధినేత డాక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామంలో ఆదివారం ఎంవీ రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ వివేకానంద రెడ్డిని సత్కరించారు. ఈ శిబిరంలో 257 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 17 మందికి శుక్లాలు, 12 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చుక్కల మందు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరంలో అతి సున్నిత భాగమైన కళ్లు అని.. వీటిపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా సుబ్బారావు, మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య, నాయకులు ఇంటూరి ప్రసాద్, గొట్టిపాటి రాజారావు, జాష్టి నాగసూరి, మాలంపాటి పెద్ద కొండలు, వెలగటూరి బ్రహ్మానందం, చిరుమామిళ్ల మల్లయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వానర దండు.. సమస్యలు మెండు

- పంట చేలను నాశనం చేస్తున్న కోతులు
- రైతులపైనా దాడి
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - తెనాలి

ఆరుగాలం శ్రమించిన రైతన్నకు చివర్లో ప్రకతి వైపరీత్యం కలవరపెడుతుంటే.. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ఎక్కడ నుంచి వచ్చిందోగానీ, వానర దండు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రూరల్ గ్రామం కొలకలూరు జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న సాగు భూముల్లో పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. చేతికి అందొస్తున్న పంట.. కోతులపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు.. అధికంగా దళితులు సాగు చేసుకునే గురువు నేలలో పంటలు అంతంతమాత్రంగానే పండుతుంటాయి. ప్రస్తుతం పెసర, మినుము, వేరుశనగ సాగు చేస్తున్నారు. రైతులంతా 20 నుంచి 50 సెంట్లలోపు భూములున్న వారే. ఎన్నడూ లేని విధంగా కోతుల దాడి పెరిగిపోయింది. పంట చేలలో పైరును నాశనం చేయడాన్ని గమనించిన రైతులు వాటిని తరిమికొడుతుంటే.. అవి మూకుమ్మడిగా వచ్చి తిరిగి పొలాలపై దాడి చేస్తున్నాయి. వానర బాధ భరించలేక.. రైతులు వేకువజాము మొదలు పొద్దుపోయే వరకూ కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక గట్టున కాపలా ఉంటే.. మరోవైపున కోతులు వీరంగం చేస్తున్నాయి. అదిలిస్తున్న రైతులపై కూడా దాడులకు వెనుకాడటం లేదు. చివరికి పొలాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. గుంపుగా వెళ్లాల్సి వస్తోంది. అధికారులకు సమాచారం అందిస్తున్నా స్పందన ఉండటం లేదని వారు వాపోతున్నారు. పూత, పిందె దశలోనే పంటను పూర్తిగా నాశనం చేస్తున్నాయని.. అప్పులు చేసి, సాగుకు ఉపక్రమిస్తే చివరికి నామరూపాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వానరాల నుంచి పంటలను, ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.



పంట చేలలో కోతుల గుంపు



గతంలో ఎన్నడూ చూడని వైపరీత్యం

దాదాపు 40 సంవత్సరాలుగా భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఎప్పుడు కూడా కోతులు మూకుమ్మడి దాడి చేసిన సందర్భాలు లేవు. ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చాయో, లేక ఎవరైనా పట్టుకొచ్చి వదిలారో! ఓవైపు పంటలను నాశనం చేస్తున్నాయి. అడ్డుకున్న రైతులపైనా దాడికి పాల్పడుతున్నాయి. పొలం వైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. పెట్టిన పెట్టుబడులూ వచ్చేలా లేవు. అధికారులే దయచూపాలి. కోతుల బారి నుంచి రక్షించాలి. **-ఎ.ఎలిజబెత్, మహిళా కౌలు రైతు**

ఒక్కరోజులోనే 20 సెంట్లలో పంట నాశనం..

తెల్లవారిందంటే పొలంలో ఉండాల్సిందే. పొద్దుపోయేంత వరకు కంటికి రెప్పలా పొలాన్ని కాపాడుకోవాల్సి వస్తోంది. లేనిపక్షంలో మొత్తం పీకి పందిరి వేస్తున్నాయి. ఒకరోజు అత్యవసర పని ఉండి బయటకు వెళ్లాను. కోతులు దాదాపు 20 సెంట్ల భూమిలో మొక్కలు లేకుండా పీకేశాయి. చాలా ఇబ్బందికర పరిస్థితులే. అధికారులు కనికరం చూపాలి.

-ఎం.ప్రసాద్, రైతు, కొలకలూరు



పెనుమాకలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ లక్ష్మీ ఫౌండేషన్, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్లం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పెనుమాక ఎలిమెంటరీ పాఠశాలలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 165 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణి, ఇమ్రాన్, సిబ్బంది గురవయ్య, రజియా పాల్గొన్నారు.



ప్రజల హృదయాలను చూరగొన్న 'అలూరి'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నిరాశవాద కవి, అంతర్ముఖ కవిగా నిందలు పడిన అలూరి బైరాగి.. అసంఖ్యాకంగా అభ్యుదయ కవితలను రచించి ప్రజా హదయాలను చూరగొన్నారని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కవిరాజా పార్కులోని వడ్లమూడి గోపాల కష్ణయ్య సీనియర్ సిటిజన్ భవనంలో అలూరి బైరాగి శతజయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యార్లగడ్డ మాట్లాడుతూ.. కవిత్వానికి, జీవితానికి మధ్య ఉన్న రేఖను చెరిపేసిన కవి బైరాగి అని కొనియాడారు. 'అమాత్యుని అకాలమత్యువు' వంటి అద్భుతమైన కవితలు రాసిన మహాకవిగా ప్రశంసించారు. అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన సభలో ప్రముఖ కవి బండ్ల మాధవరావు, వల్లూరు శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు.



అనంతరం ఆలూరి బైరాగి కవితలతో అరసం ప్రచురించిన 'కవితా ప్రవంతి' అనే పుస్తకాన్ని యార్లగడ్డ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి సింగారావు, ఆచార్య గుజ్జర్లమూడి కపాచారి, ముత్తేవి రవీంద్రనాథ్, లలితానంద ప్రసాద్, అయినాల మల్లేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, కంచర్ల వెంకటేశ్వరరావు, శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని కేంద్ర గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పచ్చదనం-ప్రాణహితం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుర్రిపాలెం గ్రామంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలన్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో ప్రారంభించామన్నారు. తొలిదశలో రహదారులకు ఇరువైపులా సుమారు 300 మొక్కలను నాటే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో కూడా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తరిస్తామన్నారు. ఏడాదికి రూ.50 లక్షలతో ఐదేళ్లలో రూ.2.50 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు దుగ్గిరాల సీసీఎల్ ప్రాజెక్ట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ ముందుకొచ్చారని తెలిపారు. మొక్కలకు అవసరమైన ట్రీ గార్డులను సైతం వారే సమకూరుస్తానని ప్రకటించడం ఆనందదాయకమన్నారు. పర్యావరణహితమైన గుల్మొహర్, సొనపత్తి, స్పతోడియ, జకరందా, పెల్టోఫొరుం లాంటి విభిన్న జాతులను నాటుతామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీవో అత్తోట దీప్తి తదితరులు పాల్గొన్నారు.






మొక్కలకు నీరు పోస్తున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

పింఛన్లు పంపిణీ చేసిన పెమ్మసాని

బుర్రిపాలెం గ్రామంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కేంద్ర గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పంపిణీ చేశారు. 'పచ్చదనం-ప్రాణహితం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చేరుకున్న ఆయన.. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలసి పలువురు వద్ధులకు పింఛన్లు అందజేశారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- ఈవీఎంల పనితీరుపై అనుమానాలు
- ఎమ్మెల్సీ హనుమంతరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికలలో ఈవీఎంలపై అనేక పార్టీలు అనుమానం వ్యక్తం చేశాయని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన దుగ్గిరాల మండల వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు సక్రమంగా జరగాలన్నారు. ఈవీఎంలపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహించాలని దేశంలో అనేక పార్టీలు కోరుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. ఈ ప్రభుత్వంపై అప్పుడే ప్రజావ్యతిరేకత మొదలైందని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్త డి.వేమారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దోమతెరలు అందజేస్తున్న దిలీప్‌రాజా

దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న సంచార తెగల కుటుంబాలకు ఆదివారం సినీ దర్శకుడు దిలీప్ రాజా దోమతెరలను పంపిణీ చేశారు. తెనాలి మార్కెట్ వంతెనల వద్ద పలు సంచార కుటుంబాలు చిన్నారులతో సహా రాత్రివేళల్లో రహదారులపైనే నిద్రిస్తున్నాయి. వారు ప్రశాంతంగా నిద్ర పోవాలన్న ఉద్దేశంతో మానవతాదృక్పథంతో వారికి దోమతెరలు పంపిణీ చేసినట్లు దిలీప్ రాజా తెలిపారు. పెదరావురు, కొలకలూరు కాలువ కట్టలపై జీవిస్తున్న గిరిజనులకు బియ్యం, నిత్యావసరాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దర్శకులు రత్నాకర్, మునిపల్లి శ్రీకాంత్, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక..



ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండల పరిధిలోని సంఘం జాగర్లమూడి శ్రీ కొత్త వెంకయ్య చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు1979-1980 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఒక చోట చేరి.. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కుటుంబాల పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 44 సంవత్సరాల తర్వాత పాఠశాల పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుపాన్ ప్రభావం వలన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్ష ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విభాగాదిపతులను ఆదేశించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫెంగాల్ తుపాన్ ప్రభావం వలన నగర ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తక్షణం స్పదించడానికి జిఎంసి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన బెయిల్ అవుట్ చేసేలా మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెట్ల కొమ్మలు పడిపోతే వెంటనే తొలగించేలా సామగ్రితో సిద్దంగా ఉండాలని ఏడిహెచ్‌ని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయం ఏర్పడితే త్రాగునీటి సరఫరాలో సమస్య రాకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచాలని, అవసరమైన సిబ్బందికి ముందుగానే విధులు కేటాయించాలని ఆదేశించారు. నగర ప్రజలు వర్ష ప్రభావంతో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

హైకోర్టు న్యాయవాదికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-తాడేపల్లి



హైకోర్టు న్యాయవాది, తాడేపల్లికి చెందిన అనుముల వంశీకృష్ణకు ట్రాన్సూర్ యూనివర్సిటీ ఇటీవల గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం, నికరంపల్లిలో జన్మించిన వంశీకృష్ణ గత 25 సంవత్సరాలుగా తాడేపల్లిలో నివాసం ఉంటున్నారు. తన జీవిత ప్రయాణంలో కష్టాలు, కన్నీళ్లు, బెదిరింపులు, ఒడిదుడుకులు ఎదుర్కొని ముందుకు సాగినట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో అణగారిన వర్గాలపై హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలకు బలైన బాధితులకు గొంతుకై నిలిచారు. వారికోసం న్యాయ పోరాటం చేశారు. వంశీవృష్ణను అభ్యుదయ వాదులు, నేతలు అభినందించారు.

ట్రాఫిక్ సమస్యలను నివారిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తామని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన శ్రద్ధ వహించాలన్నారు. నూతన సంవత్సరంలో గుంటూరు నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళు ళ పని చేసే విధంగా కృషి చేయాలని ట్రాఫిక్ సిగ్నళ్ల సాంకేతిక బృందాన్ని ఆదేశించారు. గుంటూరు నగరంలో గత కొద్దిరోజుల నుండి డొంకరోడ్డు వద్ద గల మూడు వంతెనల రైల్వే అండర్ పాస్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ప్రజల దైనందిన జీవితానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంజీవయ్య నగర్, నెహ్రూ నగర్ రైల్వే గేట్ల వైపునకు మళ్లింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మూడు వంతులు వద్ద జరుగుతున్న మరమ్మతులు పనులను పరిశీలించి వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేయాలని రైల్వే కాంట్రాక్టరును కోరారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం రద్దీగా ఉండే పూలకొట్ల బజారు నందు పర్యటించి, ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్లపై వాహనాలను నిలుపుకుండా చూడాలని అధికారులను కోరారు. స్థానిక హిందూకళాశాల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పరిశీలించారు. నూతన సంవత్సరానికి గుంటూరు నగరంలో ఉన్న అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయాలని అందుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ట్రాఫిక్ సిగ్నల్స్ సాంకేతిక బృందానికి ఆదేశాలు చేశారు. ఎస్‌పి వెంట డిఎస్‌పిలు సీతారామయ్య, రమేష్, అబ్దుల్ అజీజ్, జయరాం ప్రసాద్ గారు, సీఐలు అశోక్ కుమార్, సింగయ్య, వీరయ్య చౌదరి,వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

కళ్లం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రాంగణ ఎంపికల్లో కళ్ళం ఇంజినీరింగ్ కాలేజి బి.టెక్, డిప్లొమా విద్యార్థులు 66 మంది ప్రముఖ కోర్ ఇంజినీరింగ్ కంపెనీ ఎస్‌టిఎస్‌లో ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు.ఈ ప్రాంగణిక ఎంపికలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్ తర్వాత రూ.4 లక్షల వార్షిక వేతనం పొందుతారని కంపెనీ హెచ్.ఆర్.ప్రతినిధి సతీష్ తెలియజేశారు. ఈ సందర్భంగా కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి, ఉపాధి కల్పనధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు డాక్టర్ యు. సూర్యనారాయణ, డాక్టర్ కె.హరికృష్ణ, ప్రొఫెసర్‌రాజు తదితరులు ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

వికలాంగులకు యూడిఐడి తప్పనిసరి

ఈ నంబరుతోనే సంక్షేమ పథకాలు

ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తితో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి సువార్త

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి





గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వికలాంగులకు అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు వెంటనే యూడిఐడి కార్డు పొందాలని వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్దుల సంక్షేమ శాఖ అధికారి సిహెచ్.సువార్త తెలిపారు. ఈ కార్డు ప్రతి ఒక్కరూ పొందాలని ఆమె కోరారు. ఈ కార్డు ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే అన్ని రకాల సదుపాయాలు వస్తాయని ఆమె వివరించారు. ఆధార్ తరహాలో దేశ వ్యాప్తంగా ఏ పథకం కోసం అయినా ఒకే నెంబరు ఉంటుంది.

యూడిఐడి కార్డు ఎలా పొందాలి?

సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్టు ఫోటో, తెల్లకాగితంపై సంతకం చేసి ఆన్‌లైన్‌లో స్వావలంభనకార్డు డాట్.ఇన్‌లో లాగిన్ అయి నమోదు చేసుకోవాలి. ప్రైవేటు కంప్యూటర్ సెంటర్లలో కూడా నమోదు చేస్తారు. వీరు ఒక నెంబరు ఇస్తారు. ఈ నెంబరు ఆధారంగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే అక్కడ ధ్రువపత్రాలు పరిశీలించి కార్డు జనరేట్ చేస్తారు. 10 రోజుల్లో యూడిఐడి కార్డు ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ప్రతి పథకంలో ఈ కార్డులో ఉన్న నెంబరు తప్పని సరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కార్డుతోనే అన్ని సంక్షేమ పథకాలు అనుసంధానం అవుతాయి.

వికలాంగులకు అందుతున్న ప్రోత్సాహకాలు?

స్వయం ఉపాధి పథకం ద్వారా వికలాంగులు ఏమైనా వ్యాపారం చేసుకునే వారికి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణం ఇస్తాం. తమ కార్పొరేషన్ ద్వారానే రుణాలు ఇస్తాం. వ్యాపారానికి సంబంధించిన వివరాలతో పాటు శాశ్వత ఆస్తితో కూడిన ష్యూరిటీ లేదా ప్రభుత్వ ఉద్యోగి నుంచి హ్యామీతో కూడా ధ్రువపత్రం ఇస్తే రుణం మంజూరు చేస్తాం. జాతీయ వికలాంగుల అభివృద్ధి సంస్థ ద్వారా గరిష్ఠంగా రూ.5 లక్షల రుణం లభిస్తుంది. కేవలం ఐదు శాతం వడ్డీతో రుణం ఇస్తాం. 60 నెలల్లో రుణాలు తిరిగి చెల్లించాలి. చిరు వ్యాపారులకు కూడా అవకాశం ఉంటుంది.

వికలాంగుల రిజర్వేషన్లపై ఉద్యోగాలు?

ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు కేటాయించిన ఖాళీలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తుంది. 2022-23లో జిల్లాలోని సీనియారిటీ, అర్హతల ఆధారంగా ఇటీవల 31 మంది వికలాంగ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. తరువాత ఖాళీల భర్తికి ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది.

వికలాంగులకు క్రీడలు?

ప్రపంచ వికలాంగుల దినం సందర్భంగా ఈనెల 3న గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. వికలాంగులంతా పాల్గొన వచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో పనిచేస్తున్న వారు, చదువుకుంటున్న వారు పోటీల్లో పాల్గొనాలి. చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, క్రికెట్, వాలీబాల్, సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహిస్తాం. ఎన్‌టిఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోటీలు జరుగుతాయి. తరువాత బహుమతి ప్రదానం కూడా ఉంటుంది.

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు లీగ్ మ్యాచ్‌లు ఆదివారం పేరేచర్ల ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. అండర్ -14 బాలుర విభాగంలో ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎఫ్‌సి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఇరు జట్లు మధ్య రసవత్తరంగా మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ 2-2 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. అలాగే అండర్-12 విభాగంలో టిఎన్‌ఆర్ ఎఫ్‌సి, భాష్యం స్కూల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టిఎన్‌ఆర్ ఎఫ్‌సి 1-0 స్కోర్‌తో గెలిచింది. అండర్ 12 విభాగంలో ఎల్‌ఎఫ్‌సి ఎఫ్‌సి, స్టెమ్ ఎఫ్‌సి మధ్య జరిగిన మ్యాచ్ 3-3తో డ్రాగా ముగిసింది. ఈ పోటీలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అండ్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ కుమ్మర క్రాంతికుమార్, జిల్లా సెక్రెటరీ దుర్గమోహన్ పర్యవేక్షించారు.

నేటి నుండి మండల, మున్సిపల్ స్థాయిలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నేటి నుండి మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


వర్సిటీలో ఉత్సాహభరితంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా సాగాయి. రెండో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్ కుమార్ వెల్లడించారు. 67 కేజీల విభాగంలో మదురై కామరాజు యూనివర్సిటీ క్రీడాకారుడు సౌత్ వెస్ట్ షెన్ బాగారాజ్ 154 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు. మనోన్మానియం సుందరంనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎం. గోపి సుదర్శన్ 143 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని సాధించారు. ఎస్‌ఆర్‌ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్రీడాకారుడు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని పొందారు. 73 కేజీల విభాగంలో తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు లోగేశ్వరన్ 159 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని పొందారు. అలాగే ఆంధ్ర కేసరి యూనివర్సిటీ క్రీడాకారుడు ఎన్వి. మహేష్ 156 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని, తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు ఏ. మనోబాల 156 కేజీల బరువులెత్తి మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం పొందారు. 81 కేజీల కేటగిరిలో మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు బి. రజత్ రాయ్ 170 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు. మనోన్ మానియం సుందరనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎన్ఎస్. అభిషేక్ వెండి పతకాన్ని గెలుచుకున్నాడు. యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్ సాగర్ 163 కేజీల బరువులు ఎత్తి కాంస్య పథకాన్ని సాధించారు.



సిల్వర్ పతకం సాధించిన ఆంధ్ర కేసరి యూనివర్సిటీ క్రీడాకారుడు ఎన్వి మహేష్



73 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న లోగేశ్వరన్



81 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన రజత్‌రాయ్